నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com



## నిజం

నేను నాదంటూ గిరి గీసుకుని నలుగురిలో కలవలేనపుడు...
అన్నీ దూరమే.. మిగిలేది ఒంటరితనమే...
చిత్రించిన లక్ష్మణరేఖను చిరునవ్వుతో ఛేధించి చూడు..
చుట్టూ ఉన్నవారందరూ నీవారే అనిపించకపోరు...



-విజయ రామగిరి, 9949043229

## గజల్

కోట్ల కొలది ధనమున్నా మట్టిలోకి చివరికి
దేహమెంత అందమున్న కట్టెపైకి చివరికి.

అన్ని నావె అనుకుంటూ ఆశనింత వదలక
ఆయువెళ్లి పోయినాక మింటిలోకి చివరికి.

నీటి బుడగ జీవితాన్ని యెన్నినాళ్ళు గడిపిన
బరువెక్కిన గుండెనీరు కంటిలోకిచివరికి.

బంధువర్గ మంత చేరి బాసలెన్ని యాడిన
బంధాలను తెంచుకుంటు కాటిలోకి చివరికి.
శాశ్వతంగ లోకంలో నిలిచేదీ శ్రీగన
నిత్యమైన సత్యమైన మాట ఒకటి చివరికి.



-గణపురం పరమేశ్వర్
7013333911

## సత్యం ఒక్కటే

యవ్వనం మిసమిసలు
తరలి వెళ్ళే తరంగాలే.
సుఖసంతోషాలు
క్షణకాల తటిల్లతలా తాత్కాలికమే
బంధాలు, అనుబంధాలు
మనిషి జీవిత కాలమే.

అందం ఐశ్వర్యం
కాలానుగుణంగా
అడ్రస్ కోల్పోయేవే.
కీర్తి ప్రఖ్యాతులు
కాలగర్భంలో కలిసిపోయేవే.
సౌకర్యాలు విలాసాలు
జీవితాకాశాన
అందాల మేఘాల్లా
అలా వచ్చి ఇలా వెళ్లిపోయేవే.
ఏ కాలంలోనైనా
ఏ మతంలోనైనా
భాషలు ఎన్నైనా
సంస్కృతులు వేరైనా
సత్యం ఒక్కటే
ఎల్లప్పుడూ శాశ్వతం
సమకాలీనం, సర్వకాలీనం
మార్పులకు అతీతం.



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## నా ఊరు

ఏకశిలా నగరానికి
ఎంత దూరమో నా ఊరు
నా ఊరు చుట్టూరా కాన కాపలదారు
పూలగాలి సోకి పులకించినా నా ఊరు
అడవి గాలి సోకి అందమొచ్చె
తరుల శాఖలన్నీ తలనిండా పూలెట్టి
బాటసారికి బహుసువాసనలు చిమ్మ
ముడుచుక పోయినా సందు దారుల్లోన
మేషకంఠల ధ్వనులే
మెందు నా పల్లెనా
పచ్చ పచ్చని పైరు మెట్టపంటల తోడ
పసిడి పైటను
చుట్టుకొని పరవశించిన నా ఊరు
నక్సలాజానికి జిల్లాలో నారుపోసి
తూటాను లాఠీని ప్రతిఘటిస్తూ
కుత్తుకానిందార కత్తులను దాచుకొని
దొరతనానికి కంపరం పుట్టించి
కొవ్వొక్కెన నరాల కొంపముంచె
శ్రమజాతి చెమటతొ
తడిసిన నా ఊరు
నల్లబంగారు గనులతో
నవ్వుచుండెను నేడు
నిర్బంధాన్ని పెకిలించి
స్వేచ్ఛకు తావిచ్చి
సుత్తి కొడవళ్ళతో ప్రజల కాపుకాస్తూ
తన శక్తిని భూమిపై పరచి
తన యుక్తితో అవనిపై నిలచి
ఋషిలు జీవిస్తుంది నా ఊరు
కృషితో పయనిస్తుంది నా ఊరు
అనంత చరిత్ర పుటలపై నా ఊరు
అడుగులు తిరిగి చూసుకుంటుంది.



- గజవెల్లి
సెల్: 8985754016

## నైజం

మూడు వంతులు ఉప్పు నీరు
ఒక వంతు మంచి నీరు
ఈ భూమ్మీద.

మూడు వంతులు స్వార్థం
ఒక వంతు నిస్వార్థం
ఈ గడ్డమీద



-వి.సూర్యారావు
92469 11234

## వాటరే మ్యాటర్

దాహమంతా
క్యాన్లల్లో బంధీ అయ్యింది
పట్నం పల్లే తేడా లేకుండా
మినరల్ బాటిల్ ఊరేగుతున్నాయి
చెలిమె లోని తీయదనం
బిందె నీళ్ల లోని స్వచ్ఛధనం
డబ్బులతో బాటిల్ గొంతుల్లో
వెక్కిరిస్తూ వాటర్ అరుపులతో
ఆటోల్లో.....
ప్రతి ఇంటికి తిరుగుతూ
ఇప్పుడు ధర కాదు
నీళ్లే గగనం
ఇప్పుడు ఏదీ కాదు
దాహం తీరడమే మార్గం
ఎంత వారైనా క్యాన్ మోయాల్సిందే
బండి మీదనో నెత్తి మీదనో
వాటర్ క్యాన్ మోసే వ్యాన్
ఇంటింటికి తిరుగుతూ
ప్రశ్నిస్తూ.....
ఇంటి పడుచులను
నీళ్ల బిందెలను
అదిగో.......
ఆడపడుచు ఎదురుచూస్తున్నది
ప్రతి వాహన చప్పుడును
తదేకం గా పనులన్నీ పక్కనెట్టి
వింటున్నది
నా పల్లె పై మినరల్
ప్రేమను మించి పోతున్నది
దాహార్తి ని డబ్బులతో
జమజేసుకెళ్తున్నది
వాహనాల్లో నీళ్ల పేరా
ఫిల్టర్ యంత్రాల్లో పల్లెను పట్నాన్ని
బంధీ చేసింది
ఇక ఒక్క రోజు క్యాన్ ఆటో
రాకుంటే మరొక్క రోజు క్యాన్
మనకు అందకుంటే
బావులు నల్లలన్నీ దీనమవుతాయి
ఇంటి పనులన్నీ లయ తప్పుతాయి
బిందెలన్ని చప్పుడు చేస్తాయి
నా పల్లె ఊపిరి ఇప్పుడు
మినరల్ వాటర్
నా పట్నం పు శ్వాస ఇప్పుడు
మినరల్ క్యాన్
మనందరి శ్వాస ను బిగబట్టిన
మ్యాటర్ వాటర్ క్యాన్
ఇప్పుడు వాటరే
అందరి మ్యాటర్



- సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## యుద్ధం

సామాన్యుల చావు కేకలు
కరిగించవు కరకు గుండెలను...

అస్త్ర సన్యాసం పుచ్చుకోని
ఉక్రెయిన్ ఆత్మాభిమానం!

ఆయుధాలకు ఆజ్యం పోస్తున్న
అమెరికా మిత్ర బృందం!

మాయల పుతిన్ చూపుతున్న
అణువస్త్రపు మూడో కన్ను?

మూడో ప్రపంచ యుద్ధమా!
అంటూ ముక్కున వేలేసుకుంటున్న
వర్తమాన దేశాలు!

పొంచి వున్న అణు ముప్పుపై
కలసి కట్టుగా స్పందించాలి
వసుధైక కుటుంబం..!



-బొల్లారపు బాబన్న
9440654583




## ఘంటారావం

ప్రాణం మీదికొస్తేనే
పాము కాటు వేస్తుంది
చేటు చేయకున్నా
స్వార్థం వేటు వేస్తుంది.

అమ్మ ఒడిలో ఆదమరచి
నిదురిస్తే ఆనందం
బోసినవ్వుల పసిపాపను
స్పర్శిస్తే ఆనందం.

విన్నదంతా
వాస్తవమనుకుంటే ఎలా?
వ్యతిరేకించే ఆలోచనల్ని
వినాలి కదా.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# చిట్టి వాక్యాల్లో కొండంత సారం

చిట్టి వాక్యాల్లో కొండంత సారాన్ని చూపే నానీలను రచించి తన ప్రత్యేకతను నిలుపుకున్నారు ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి. సుప్రసిద్ధ కవి ఆచార్య ఎన్. గోపి ప్రవేశపెట్టిన ఈ చిట్టి కవితారూపంలో రమాదేవి రచించిన నానీలు పాఠకులను ఆలోచనల్లో ముంచెత్తుతాయి. వినోదాత్మకంగానూ ఉంటాయి. వెయ్యి వాక్యాల సారాంశాన్ని క్లుప్తంగా అందిస్తాయి. భాషాపరంగా ఉత్తమ స్థాయిలో నిలబడతాయి. 'పన్నుల' ప్రపంచాన్ని కన్నులకు రమణీయంగా చూపిస్తాయి. ఆమె రాసిన నానీల సంకలనం 'చినుకులు' పాఠకుల మదిలో భావ ప్రకంపనలను సృష్టిస్తుంది.




ఉపాధి మార్గంలో సమకాలీన కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. కనిపెంచిన తల్లిదండ్రుల ఊసును మారిచే పిల్లలెందరో! ఈ విషయాన్ని తన నానీలలో చూపారు రమాదేవి.

**కుక్కకు బ్రెడ్**
**కారుకు షెడ్**
**అమ్మానాన్నలకు**
**ఏదీ బెడ్, ఫుడ్?**

ప్రపంచం భౌతిక సుఖాలకు ప్రాధాన్యత ఇస్తోంది. తనను కన్నవారిని మరిచిన మనిషి తాను కొన్నవాటిని ప్రాణంగా చూసుకుంటున్నాడు. ఇదే విషయాన్ని క్లుప్తంగా పై పంక్తుల్లో పేర్కొన్నారు రమాదేవి. కుక్కను, కారును ప్రాణప్రదంగా చూసుకునే పిల్లలు తల్లిదండ్రుల విషయానికి వచ్చేసరికి బాధ్యతలను మర్చిపోతున్నారని విమర్శించడం ఈ పంక్తుల్లో కనబడుతుంది.

వస్తువుల్లా తల్లిదండ్రులను కూడా పంచుకుంటున్న కాలం. జీవితమంతా కుటుంబానికే అంకితం చేసే తండ్రి ఉద్యోగ విరమణ తర్వాత కొడుకులకు పనికి రాని వస్తువవుతాడు. తల్లికే జై కొట్టే తనయులెందరో! దీనికి కారణం తల్లిపై ప్రేమ కాదు. మరేదో కారణం ఉంది. ఆ గుట్టు విప్పి చెప్పారు రమాదేవి.

**పుత్రులకు నాన్నొద్దు**
**అమ్మే కావాల్ట-**
**పనికి ఆహార పథకమా**
**మజాకా!**

అమ్మయితే వంట పనికి, ఇంటి పనికి పనికి వస్తుందన్న అభిప్రాయం చాలా మంది పిల్లలది. ఈ అభిప్రాయంతో తండ్రి పనికిరానివాడవుతున్నాడు.

ఈ రోజుల్లో పిల్లలు రెక్కలొస్తే చాలు విదేశాలకు పరుగెడుతున్నారు. కాసుల వేటలో యువత దేశానికి వీడ్కోలు చెప్తోంది. ఈ విషయాన్నే తన నానీల్లో ప్రస్తావిస్తారు ఈ కవయిత్రి.

**రెక్కలొచ్చిన పిల్లలు**
**ఛలో విమానాశ్రయం**
**ఇప్పుడు దేశమే**
**వృద్ధాశ్రమం!**

బ్రెయిన్ డ్రెయిన్ పై వచ్చిన చక్కటి కవితల్లో ఇది కూడా ఒకటిగా భావించవచ్చు. యువత విదేశాలకు ప్రయాణమైతే మిగిలిపోయేది వృద్ధులే కదా! అందుకే దేశం వృద్ధాశ్రమంగా మారిపోయిందని వ్యాఖ్యానిస్తారు రమాదేవి.

ఉద్యోగాల వెతుకులాటలో విదేశాలకు పయనమైన యువకులు అక్కడే స్థిరపడిపోతున్నారు. వారి సంతానమూ అక్కడివారే అవుతున్నారు. అమెరికాలో పుట్టినా మనుమల్లో ఉండేది మన రక్తమేనని విస్పష్టంగా చెప్పారు.

**అమెరికాలో పుట్టే**
**పిల్లలకు పౌరసత్వం**
**మారుతుందా**
**మన రక్తం!**

చాలా మంది మధ్యవయస్కుల విదేశీయానం ఇప్పటి నయా ట్రెండ్. దీనికి కారణం టూరిజమో విద్యాభ్యాసమో కాదు. మరెందుకో కింది పంక్తులు చదివితే తెలుస్తుంది.

శీతాకాలం
వలసపక్షులు
ప్రవాస బిడ్డ ప్రసవానికి
అమ్మ పక్షులు

శీతాకాలం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస వెళ్ళే పక్షులతో తల్లులను పోలుస్తారు కవయిత్రి.

అమ్మపై ఇప్పటికే చాలా మంది చాలా రకాలుగా కవితలు రాశారు. రమాదేవి కూడా అమ్మపై నానీలు రాశారు. కానీ ఇప్పుడు వాటిని ప్రస్తావించడం లేదు. అమ్మమ్మపై రమాదేవి రాసిన నానీ చూద్దాం.

**సూర్యుడి స్కూల్ బస్ వస్తే**
**మబ్బు చీరలో**
**శశిని దాచే**
**ఆకాశం అమ్మమ్మ**

అమ్మమ్మను ఆకాశంతో పోల్చడం ఇక్కడ కనబడుతుంది. మనుమడు చంద్రుడట. సూర్యుడొచ్చినప్పుడు చంద్రుడు మాయమవుతాడు కదా. అలా సూర్యుడి బస్సు వచ్చినపుడు అమ్మమ్మ చీర మబ్బుగా మారి మనుమడిని కప్పేసిందట.

బాల్యంపై రమాదేవి రాసిన నానీలు ఆకర్షిస్తాయి.

రాత్రి కాకమునుపే
నక్షత్రాలు వచ్చాయి
సాయంత్రం
బడి వదిలారు!

ఈ పంక్తుల్లో బాల్యం అని గానీ బాలలు అనిగానీ ఎక్కడా లేకపోవడం గమనార్హం. బడి వదిలిప్పుడు బిలబిలమంటూ బయటికి వచ్చే బాలలు రాత్రి కాకుండానే వచ్చేసిన నక్షత్రాలని కవయిత్రి భావన. ఇలాంటి మరెన్నో నానీలను బాల్యంపై రాశారు రమాదేవి.

**రవిని భువి**
**నిద్రపుచ్చి రాత్రంతా**
**పొద్దున్నే ఆకాశం బడికి**
**అప్పగింత**

ఇక్కడ తల్లిని భూదేవి తోనూ తనయుడిని సూర్యుడితోనూ పోల్చడం కనబడుతుంది. రాత్రంతా భూదేవి సూర్యుడిని నిద్ర పుచ్చి ఉదయాన్నే ఆకాశానికి అప్పగించడమనే అంశాన్ని పోలికగా తెచ్చి, బాలుడిని రాత్రంతా నిద్రపుచ్చిన తల్లి ఉదయాన్నే పాఠశాలకు పంపే అంశాన్ని చెప్పారు.

సామెతలను, లోకోక్తులను, జాతీయాలను అవసరం మేరకు చెప్పవలసిన అంశానికి సాధికారతను, శక్తిని అందించేందుకు ఉపయోగించుకుంటారు ఈ కవయిత్రి. ఉదాహరణకు కింది పంక్తులు చూద్దాం.

**కూర్చునే కొమ్మ నరికితే**
**మూర్ఖుడు**
**గర్భంలో పిల్లని చంపితే**
**రాక్షసుడు**

భ్రూణహత్యలపై వచ్చిన చక్కటి కవిత ఇది. మరి కొన్ని పంక్తులను పరిశీలిద్దాం.

**బతికుంటే బలుసాకు**
**పాత సామెత!**
**ఆయుష్షు కోసం**
**ఆకులే నేటి మేత!**

ఆరోగ్యం కోసం ప్రకృతిపరంగా ఉన్న సహజమైన ఆకులను ఉపయోగించే వైద్య విధానాలపై రమాదేవి రాసిన కవిత ఇది. ఇలాంటి మరెన్నో కవితలను రమాదేవి రాశారు.

పిట్ట అద్దాన్ని పొడవడం చాలా మందిమి చూసి ఉంటాం. అందులోనూ ఏదైనా సందేశం కనబడుతుందా? రమాదేవి దృక్కోణం వేరు. అందుకే ఈ విషయం లోనూ ఒక సందేశం ఆమెకు కనబడుతుంది. ఈ దృక్కోణమే ప్రత్యేకత కలిగిన కవయిత్రిగా ఆమెకు పేరు తెచ్చిపెట్టింది.

**పిట్ట**
**అద్దాన్ని పొడుస్తోంది**
**మనిషికీ అదే కావాలి-**
**ఆత్మ విమర్శ!**

ప్రకృతిలో జల చక్రాన్ని అందరం గమనిస్తాం. ఈ కవయిత్రి చూసే చూపులో, చెప్పే పద్ధతిలో ఉండే విలక్షణత వల్ల ఈ ప్రక్రియ ఇలా కవిత్వ రూపంలోకి వచ్చింది.

**సముద్రంపై**
**మేఘం కురిసిన వర్షం**
**ఉప్పు తిన్నందుకు**
**తీర్చుకునే ఋణం**

ఇక్కడ 'ఉప్పు తినడం' అనే జాతీయ ప్రయోగాన్ని గమనించవచ్చు. సముద్రం నుండి నీటిని స్వీకరించే మేఘం ఆ రుణం తీర్చుకునేందుకు సముద్రంపై వర్షిస్తోందని రమాదేవి చెప్పారు.

ఇదే సందర్భంలో రమాదేవి రాసిన మరో కవిత గుర్తొస్తోంది.

**ఉప్పెక్కువయితే**
**రక్తపోటు**
**సముద్రానికందుకే**
**ఆటుపోటు!**

సముద్రాన్ని మానవీకరించడం ఈ పంక్తుల్లో కనబడుతుంది. ఉప్పెక్కువైతే బీపీ పెరగడం సాధారణం. సముద్రంలో అంతర్భాగంగా ఉన్న ఉప్పు వల్లే సముద్రం ఆటుపోట్లకు గురవుతోందనడం ప్రత్యేక అంశాన్ని సాధారణ అంశంతో పోలిక తెచ్చి కవిత్వీకరించడం.

రమాదేవి కవితల్లో మరో ప్రత్యేక అంశం భాషాప్రయోగం. పదాలతో 'పన్' చేయడం, పదక్రీడలు ఆమె కవితల్లో కనబడతాయి.

**పని చేయడం వల్ల**
**అనారోగ్యం**
**పంచేయడం వల్ల**
**దారిద్ర్యం ఎప్పుడూ రావు**

ఇక్కడ 'పని చేయడం', 'పంచేయడం' అనే పదాల సమర్థవంతమైన ప్రయోగం పాఠకులను ఆకర్షిస్తుంది.

**మొక్క చెట్టయినా**
**మూలం తల్లివేరే**
**పిల్లలు పెద్దయ్యాక**
**మాత్రం తల్లి వేరే!**

ఈ పంక్తుల్లో 'వేరే' అనే పదాన్ని వేర్వేరు అర్థాల్లో ప్రయోగించడం కవయిత్రి నేర్పుకు, సమర్థతకు ఉదాహరణగా నిలుస్తుంది. లోకరీతిని తనదైన శైలిలో చెప్పడం రమాదేవి కవిత్వంలో కనబడే ప్రత్యేకాంశం.

**నట్టిల్లయినా**
**నెట్ ఇల్లయినా ఒకటే!**
**మదర్ బోర్డు పోతే**
**చీకటే!**

తల్లి ప్రాముఖ్యతను తెలియజేసె కవిత ఇది. తల్లి లేకపోతే ఇంటికి చీకటే అనే అర్థంతో పాటు మదర్ బోర్డు లేకుంటే కంప్యూటర్ పనికిరాదని చెప్పడం మరో అర్థం.

ఇప్పటికే తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం, ప్రతిభాపురస్కారం, సుశీలా నారాయణరెడ్డి పురస్కారం వంటి అనేక అవార్డులు పొందిన రమాదేవి రాసిన 'చినుకులు' నానీల సంకలనం పాఠకులను ఆకర్షించే శైలితో కూడుకొని ఉంది. భాషాపరంగా, వస్తుపరంగా ఉత్తమ స్థాయిలో నిలబడే కవిత్వం ఈ సంకలనంలో ఉంది. చిన్న చిన్న వాక్యాల్లో అనంత సారాన్ని నిక్షిప్తం చేసుకున్న నానీలివి.

ప్రతులకు: అపురూప పబ్లిషర్స్
ప్లాట్ నుం.494/ఎ. రోడ్ నెం.22
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500 033.
సెల్: 9440622781



-డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు,
9441046839

# కందేపి బాలసాహిత్యం అద్భుతం-ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

బాలల కోసం డా॥ కందేపి రాణిప్రసాద్ సృష్టించిన సాహిత్యం అద్భుతమని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. అంగల కుదిటి సుందరాచారి ఛారిటీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్జీవోస్ నేట్‌వర్క్ కార్యాలయంలో సాహిత్య కళాసేవారంగాల ప్రముఖులకు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం పుస్తకాల సమీక్ష సమావేశం ప్రముఖులకు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం పుస్తకాల సమీక్షా సమావేశం జరిగింది. ప్రముఖ కవి కళారత్న బిక్కి కృష్ణ అధ్యక్షత జరిగిన ఈ సభలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డా॥ కందేపి రాణిప్రసాద్ రాసిన 'డాక్టర్ చెప్పిన కథలు' పుస్తకాన్ని కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. డా॥ నాళేశ్వరం శంకరం సమీక్షించారు. వాసిరెడ్డి మల్లీశ్వరి, కళాతాటికొండ, డా॥ రాజేశ్, వద్దేపల్లి కృష్ణ, రాణిప్రసాద్ రాసిన 'సౌరభం', 'నా జ్ఞాపకాల్లో అమ్మ', క్వారంటైన్, ద్రాక్షగుర్తులు పుస్తకాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా శతచిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారా యణకు సినీ కార్మిక బంధు బిరుదును ప్రదానం చేశారు. డా.వి.డి. రాజగోపాల్, అంజనీకుమారికు సుందరాచారి జీవన సాఫల్య పురస్కారాలు అంద జేశారు. ప్రముఖ రచయితలు డా॥ అమరవాది నీరజ, సలీమ, నస్రీన్‌ఖాన్, శరత్‌సుదర్శి, రమాదేవి, లలిత తదితరుల పుస్తకాలకు జాతీయ పురస్కారాలు అంద జేశారు. బాల సాహిత్యం ద్వారా రాణిప్రసాద్ కృషి చేయడంతోపాటు కవులు, రచయితలను గుర్తించి పురస్కారాలతో సత్కరించడం సుందరాచారికి నిజమైన నివాళులు అర్పించడ మేనని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం ఆహుతులను అలరించింది.







గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. ● రచయిత్రిని సత్కరిస్తున్న అతిథులు. ● సభలో ప్రసంగిస్తున్న బిక్కి కృష్ణ, డా॥నాళేశ్వరం శంకరం, డా॥రాజేశ్.

# ఆదర్శవంతమైన కవి యార్లగడ్డ: రాచపాళెం





సభలో ప్రసంగిస్తున్న రాధేయ. ● యార్లగడ్డ రాఘవేంద్రరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు. ● గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి.

యార్లగడ్డ రాఘవేంద్రరావు నేటి తరానికి ఆదర్శవంతమైన గొప్ప కవి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలోని ఎన్‌జీఓ హోంలో ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు ప్రదానోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉమ్మడిశెట్టి ట్రస్టు వ్యవస్థాపకుడు రాధేయ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత డా॥ రాచపాళెం చంద్రశేర్ రెడ్డి, కవి అధ్యాపకుడు తూముచెర్ల రాజారాం చేతుల మీదుగా ఆంధ్రజ్యోతి జర్నలిజం. కళాశాల ప్రిన్సిపాల్ యార్లగడ్డ రాఘవేంద్రరావుకు అవార్డును అందజేశారు. ఆయన రచించిన 'పచ్చి కడుపు వాసన' కవితా సంపుటికి ఈ అవార్డు దక్కింది. అలాగే డాక్టర్ ఎం. పార్వతి సాహితీ పురస్కారాలను ఒడిసాలోని బరంపురానికి చెందిన తుర్లపాటి విజయవాడకు చెందిన వసుధారాణికి అందజేశారు. ఈ సందర్భంగా రాచపాళెం మాట్లాడుతూ యార్లగడ్డ రాఘవేంద్రరావు రచనలన్నీ, మన చుట్టూ నిత్యం జరిగే అంశాలను స్పృషిస్తాయని అన్నారు. రైతులు, మహిళలు మట్టి, వృద్ధులు బంధాలు, బంధుత్వాలపై ఆయన రాసేకవితలు సమాజ హితానికి ఉపయోగడతాయని అన్నారు. అవార్డు గ్రహిత యార్లగడ్డ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఉన్నంత మంది కవులు ఏ జిల్లాలోనూ ఉండరని అన్నారు.

## జ్ఞాన శూన్యులు

కనిపించని దారాలతో అల్లికలు అల్లుకున్నట్టే
కనిపించని బంధాలు
మన చుట్టూ అల్లుకుంటాయి
ఏ బంధాలు ఏ పూర్వజన్మ సంబంధాలో
మనకేం తెలుసు
నీటిమీద అడుగులు పడనట్టు
మన గత జన్మల సంబంధాలు
మనకి తెలీకుండానే మనల్ని వెంటాడుతుంటాయి
ఎంత దూరంలోనివైనా చెంతకొచ్చి
అనుబంధాలై మనల్ని
చిన్న పిల్లలు మన మెడపట్టుకొని
గుండెల మీద ఊయలలూగినట్టు
పెనవేసుకుంటాయి మనల్ని
దుఃఖాశ్రువులు కురిపించేవి కొన్ని
ఆనంద బాష్పాలు రాల్చేవి మరికొన్ని
ఎంత కురిసినా ఆగిపోయాక
తడి కనిపించని ఆకాశంలా
కాలంతో పాటు కొన్ని అనుబంధాలు
చెరిగిపోయిన రాతలవుతాయి
కడలిలోని అలల్లా
మళ్ళీ మళ్ళీ వచ్చి పోతుంటాయి
గుండెను బరువెక్కించేవి కొన్ని
గుండె మేఘాన్ని తాకి కురవబోయే
కన్నీటి వానను చెదరగొట్టే
తీవ్రమైన గాలులు మరికొన్ని
ప్రాణమున్న మనుషులకే కాదు
ప్రాణంలేని వస్తువులతోనూ
ముడివేసుకుంటాయి అనుబంధాలు
ఎవరితో ఏ బంధం ఎందుకో ఎంతవరకో
మనం జ్ఞాన శూన్యులం.



-మాధవీసనారా,
8639491246

జాతీయ సర్వభాష కవి సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాలకుగాను డాక్టర్ వద్దేపల్లి కృష్ణకు అవకాశం దక్కడం గొప్ప విషయమని జిల్లా రచయితల అధ్యక్షుడు జనపాల శంకరయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సినారె స్మారక గ్రంథాలయంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సినీ గేయ రచయిత వద్దేపల్లి కృష్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వద్దేపల్లి కవిత అన్ని భాషల్లోనూ అనువాదంగా ఆకాశవాణి కేంద్రం ద్వారా ప్రసారం కావడం సిరిసిల్లకి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో




జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, కోడం నారాయణ, రవి, దేవానందం, లక్ష్మణ్, సాయి, మహేష్, మల్లేశం, రవి, సౌమ్య పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష

# తిరుమల వెంకటస్వామి- 'వనితా విత్తోపనిషత్' నాటకం

టీ.వి. స్వామిగా అయిదు దశాబ్దాలు గా ఆకాశవాణి నుంచి ప్రస్తుత ఎలక్ట్రానిక్ మీడియాలో తన అనర్గళ కవితా వైదు ష్యంతో అవిచ్ఛిన్నంగా కవితా ప్రియులను అలరిస్తున్న వెంకటస్వామి ఏ సాహితీ ప్రక్రియ చేపట్టినా, అభిమానులను, మిత్రులను, సాహితీ ప్రియులను ఆలోచింప చేస్తారు. స్వామి, మదిలో తళుక్కుమన్న భావనా వీచికలు, ఆయన ప్రత్యేక శైలిలో రచనలుగా రూపుదిద్దుకొంటాయి. కవితా సంపుటిలు, పద్య రచనలు, నాటకాలు, వ్యాసాలు ఏదైనా చదువరులకు వెంకటస్వామి, ప్రత్యేక ముద్రతో హాస్య, వినోద, చమత్కార భరితంగా సామాజిక స్పృహ కలిగించే సత్తా ప్రదర్శిస్తాయి. అటువంటిదే 'వనితా విత్తోపనిషత్'.



వనిత, విత్తం రెండింటి ఆధారంగా రచయిత మనల్ని దేవలోకం తీసుకుపోయి, 'మహిళా జాతికి ఒక ఉపనిషత్ ఉండాలి అనిపిస్తారు. రచయిత దృష్టిలో విత్తు అంటే ధనం. యిక వనిత ప్రాముఖ్యత నాడూ నేడూ వుండనే వుంది. రూపిణి అయిన వని త, అరూపిణి అయిన సొత్తు గురించిన ప్రాచుర్య రచన తిరుమల వెంకట స్వామి గార్కి దువర్షి బృహస్పతి భావ పరంపరగా, అందచేసిన ప్రశంసలతో నాటకం పూర్తవు తుంది. వనిత, విత్తుల మనోగతా వేదనలు ఓ పనిషత్‌గా గ్రంధీకరించాలనే యోచన, ఊహించటానికి కూడా అతీతమైన ఆలోచన తిరుమల వెంకట స్వామిగార్కి కావటం, ప్రస్తుత సమాజం ఆ రెండింటి ప్రధానంగా ఎదుర్కొంటున్న దుష్ట వికారత్వాన్ని నాటకీయతా సంభాషణ, ప్రసంగ రూపకంగా వ్యక్తీకరించటం రచయిత కల్పనా చమత్కృతి, అరుదైన ఆలోచనా విశేషానికి అద్దం పడ్తోంది. పురాణ పాత్రలకు, ఆధునిక సమా జ నడవడిక జోడించి, నవ్య ఆధునికోప నిషత్, సృష్టించిన తిరుమల వెంకటస్వామి అపురూప భావోద్వేగి అయిన ప్రతిభాశాలి గా వనితా విత్తోపనిషత్ దర్శింపచేస్తోంది.

**ప్రతులకు:** టి.వి.స్వామి
ఇ.నెం. 602, పరిమళాసదన్
విమలానగర్, దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్.
సెల్: 9391100616



**-జయసూర్య**
సెల్: 90149 48336/
9440664610

## విస్ఫోటనం

ఇది విశ్వం
విహంగ గతులతో
ప్రభాత సుందర దృశ్యం
నదీనదాల తరంగ మృదంగ
నాదాల మధు గీతం...

ప్రతి ప్రాణికీ ప్రాణ లయలను కూర్చే
నవ జీవన నందన వనం..
ఎంత సహజంగా పరుచుకున్న
కళామయ వర్ణమిది...

ఆ విశాల విశ్వ వేదికకు
నిరంతర చలనశీలతతో
నిర్మాణాత్మక దృష్టి తో
కాంతులద్దిన మాననీయుడు
మానవుడు....

కాల గతిలో కొత్త పుంతలు తొక్కే
క్రమంలో ఎన్నో ప్రయత్నాలు..
దేశ దేశాల నడుమ సమన్వయం
సాగించే ఎన్నో ప్రయాసలు...

అంతర్జాతీయంగా ఉత్తమతను
స్థాపించే సమితులూ సంస్థలూ..
పర్యావరణ దీప్తినీ వన,జంతు, జన
హితాన్ని కాంక్షించే వేదికలు.....

మరి ఇప్పుడిలా ఏ మహోదయానికి
ఈ గగన గరళ విన్యాసాలు..
ఎందుకిలా అవని గొంతు నులిమే
అనుచిత అణు విస్ఫోటన ఉన్మాదాలు....



-వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

## సుద్దులు

పొద్దు పొడవక ముందే
నిద్ర లేవండి
బుద్ధిగా పుస్తకం తీసి
చదవండి !!

మొద్దు నిద్దుర మనకు
పనికిరాదండి

ముద్దు-ముద్దుగ
పనులు చక్కదిద్దండి !!

బుద్ధి తక్కువ పనులు
మానివేయండి
వృద్ధి బాటను నడిచి
విజయమొందండి !!

జిద్దులన్నీ మాని
శుద్ధిగుండండి
హద్దులు లెరిగి మీరు
ఆటలాడండి !!

వద్దు-వద్దని చెడును
వదిలివేయండి
సుద్దులెన్నో నేర్చి
మంచి చేయండి !!



**-గంభీరావుపేట యాదగిరి**
9440617611

## అంబరాన్ని తాకుతోంది..!

పవిత్రతే పరమపదసోపానంగా
సమైక్యతే చిహ్నంగా
సహనానికి ప్రతీకగా
మానవాళికి ముక్తి మార్గంగా
శాంతి సౌరభాలను వెదజల్లుతోంది..!

ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకయై
ఉదాత్త భావాల వేదికయై
విశ్వమానవ సౌభ్రాతృత్వానికి పునాదియై
సకల సౌఖ్యాలకు వారధియై
ఆరోగ్య భాగ్యాలను కలుగజేస్తోంది..!

ఐదు పూటల నమాజులు
కఠిన ఉపవాస దీక్షలు
పెద్దల ఆశీర్వాదాలు
ఫిత్రా దానాలతో
స్నేహ గంధాలను పంచుతోంది..!

పెద్దల మాట జవదాటరాదని
పిల్లల మనసు నొప్పించరాదని
కష్టంలో ఉన్న వారికి సహాయ పడాలని
పుణ్య కార్యాల్లో పాలు పంచుకోవాలనే
వ్యక్తిత్వాన్ని గుభాళింపజేస్తోంది..!

సమసమాజమే ధ్యేయంగా
ఆర్థిక సమతుల్యతే లక్ష్యంగా
సమానత్వమే సిద్ధాంతంగా
సమతా మమతలను పంచే
రంజాన్ సందడి
అంబరాన్ని తాకుతోంది..!



**-పిల్లి.హజరత్తయ్య,**
9848606573

## అవ'మాన' చరిత్ర

చూస్తున్నా..
నువ్వు నిర్లజ్జగా చేస్తున్న
దంత క్షతాన్ని
చండాలంగా చెరుస్తున్న
వంత క్షతాన్ని

నేనెవర్నని అడక్కు
నిజం చూస్తున్న చక్షువును
ఇజం రాస్తున్న భిక్షువును.

బయట మొలచిన వృక్షాన్ని
పయట తొలగిన వక్షాన్ని

అవసాన ధరిత్రిని
అవమాన చరిత్రని



**-డా.రమేష్ కటుకోర్ఘ్వల**
సెల్:9949083327

## ఆమె

కదిలే అలల్ని
చైతన్యపు ఉగ్గుపాలతో
జాగృతం చేసే
మాతృత్వ సాగరం ఆమె...
యుగయుగాల
వెతల మబ్బుల్ని
మోసుకుంటూ
కరుణను
కుండపోతగా కురిపించే
సహన విహాయసం ఆమె...
బ్రతుకు చెట్టుపై
భవితవ్యపు చిగుళ్లను
వికసింపజేసేందుకు
ప్రేమ పరిమళాలతో
అరుదెంచే
ఆశల ఆమని ఆమె...
చరిత్ర వనంలో
శౌర్య పరిమళాల్ని
వెదజల్లే
కదనపుష్పం ఆమె...
ప్రగతి వీణపై
పల్లవించే
అభివృద్ధి రాగం ఆమె...
ఇప్పుడు
జగతి తిమిరాలపై
సంధించడానికి
స్వేచ్ఛాకిరణాలతో
సమాయత్తమవుతున్న
ఉషస్సు ఆమె...

**- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర**
సెల్: 9177732414

## మూడు చక్రాలబండి

రెండుకాళ్ళ బతుకుబండి ఆకలి తీరాలంటే..
మూడుగారెల ఆటోబండిని నడపాల్సిందే.
ఎదలో రగులుతున్న
కష్టాల కుంపటి ఆరాలంటే..
రక్తాన్ని ఇంధనముగా చేసి
ముందుకు పోవాల్సిందే.
ప్రయాణికులే అతడికి ప్రపంచం.
యాభై రూపాయల బేరం
ముప్పై రూపాయలకు కుదిరినా..
పొంగుతున్న ఆశలమీద వాన కురిసినట్లు..
మనసు నిమ్మలంచేసుకొని పరుగెడుతాడు.

రోడ్లన్నీ విశాలమైన
హృదయంలా పరుచుకొని..
అతడి రాకకోసం ఎదురుచూస్తుంటాయి.
నగర వీధులన్నీ అతడు మ్రోగించే..
ఆటో సైరన్ చప్పులతో
మారుమ్రోగుతుంటాయి.
ఇద్దరో ముగ్గురో
ప్యాసింజర్లు కనిపించారంటే..
ప్రపంచాన్ని జయించినట్లు..
సప్తముముద్రాల బాధల్ని
దాటినట్లు ఫీలౌతుంటాడు.
గల్లీలన్నీ గస్తీతిరిగి.. ఏ చెట్టునీడనో సేదతీరుతూ..
అచ్చిన పైసల్ని లెక్కేస్తూ...పరివారపు
స్వప్నాల్ని కలగంటు కాలం ఎల్లదీస్తాడు.

పల్లె ప్రజల్ని పట్టణానికి చేరవేస్తూ
రంగుల సీతాకోకచిలుక
స్వేచ్ఛగా ఎగురుతున్నట్లు..
ప్రేమగా మమకారపు మాటలు చెపుతూ
గమ్యాన్ని చేరుస్తాడు.
గుండెల్లో దాగిన బాధలబరువుల్ని
ఎదుర్కొంటూ
దూరబారాల్ని దాటుతుంటాడు.
వీధులన్నీ అతగాడి ప్రాణస్నేహితులే.
సూర్యోదయాన ప్రకాశిస్తున్న రవికిరణాల్లా..
బయలుదేరి... నగరవీధులన్నింటిని
పలకరిస్తాడు.
ఏయ్...ఆటో అని పిలవగానే..
గంపెడు ఆశలతో
రెక్కలొచ్చిన పక్షిలా వాలిపోతాడు.

చమురు మంటలన్నీ జీవితాన్ని దహిస్తున్నా..
బతుకుపాటనొకటి అందుకొని..
ఒంటినిండా గంపెడు ధైర్యాన్ని నింపుకొని
జనారణ్యంలోకి దూసుకుపోతాడు.
పాలపొంగుల్లా పొంగుతున్న ఆశలపై
కన్నీళ్లను చల్లుకొని...కోరికలగొంతును
అందనంత ఆకాశానికి మూడేసుకొని..
మూడుచక్రాల పాదాలతో
యుద్ధానికి బయలుదేరుతాడు.
బతకాలంటే యుద్ధంతప్పదు మరి.
పొట్టబట్టకోసం రెపరెపలాడే రెక్కలతో
కాలంతో కలిసి ప్రయాణం చేస్తాడు.



**-అశోక్ గోనె**
9441317361

## పల్లె పాదముద్రలు

చెరువులో విసిరిన పెంకాసు..
చెంగు చెంగున నీటి అలలపై..
నవ్వుతూ తూలుతూ ఎగిరెగిరి..
తుదకు మునిగి పోవును పాపం
జీవిత కాల అలలపై ఊగుతూ..
వయసు ముదిరి అదిరి పోయి..
ముడతల తోలుతో బతుకు బక్కచిక్కి ..
మట్టిలో కలవడమే తుదకు పెంకాసులా !

తాటికాయలు నలుపే మరి..
కత్తివాటుతో తీవ్ర గాయం చేయ..
మృదు హృదయాకార ముంజలు..
ఆరోగ్యాన్నిచ్చును తియ్యగా చల్లగా సదా
మనిషి తోలు నలుపు తెలుపైనా..
అంతర భావాలు పరహితాలై..
స్వచ్ఛతల నెలవులుగా నిలిచి..
జనహృదయాల్ని రంజింపజేయాలె !

కుమ్మరి మట్టిని కాళ్లతో తొక్కి..
మన్ను ముద్దల్ని మద్దించి..
కుండగా రూపమిచ్చి కాల్చగా..
శీతల జలాన్నిచ్చే రంజనవుతది
ఏమీ తెలియని నవ శిశువు..
సమాజపు చేతులో నలిగి నిలిచి..
ఎగుడు దిగుడుల్ని అధిగమించి..
నీడనిచ్చే చెట్టులా ఎదిగి నిలబడాలి !

వర్షాకాలపు నిండు గర్భిణిలా..
చెరువు దిగుబడులు మత్తడి దూకినూ..
వేసవిలో చెరువు నెర్రెలు బారినా..
రాగడి సత్తువ మన్ను ఇచ్చును కదా
అన్ని గాబులు నిండుగా ఉన్నపుడు..
పది మందికి ఆదరువు కావాలె..
అన్ని కరిగి పోతే దిగులు చెందక..
మానవీయ విలువల ఆస్తులు పంచాలె !

**-మధుపాళీ**
9949700037

పుస్తక సమీక్ష

# ఆద్యంతం ఆసక్తికరం.. పాల్కురికి సోమన పదాకృతం...!

వేముల శ్రీ వేమన శ్రీచరణ్ సంపాదకత్వంలో పాల్కురికి సోమన పదాకృత సంకలనాన్ని వెలువరించి.. సోమనాథునికి అక్షరహారతి పట్టారు. వర్ధమాన. ప్రవర్ధమాన కవులు, కవయిత్రుల రచనలతో కొలువుదీరిన ఈసంకలనం.. పాల్కురికి సోమనాథుని సాహితీ వైభవాన్ని.. సాహితీ సేవను రేఖామాత్రిగానైనా అందించడం విశేషం! వీరశైవ కవి సోమన ప్రజాకవిగా భాసిల్లిన వైనాన్ని కవులు-కవయిత్రులు పద్య, వచన కవిత్వ రూపంలో ఆవిష్కరింప ప్రయత్నించడం ప్రశంసనీయం.. పాలకుర్తి విశేషాలను.. సోమనాథుని రచనా వైచిత్రిని ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు. 12వ శతాబ్దంలో జన్మించిన మహాకవి శివ వర ప్రసాదుడై నందున అతనికి సోమనాథుడని పేరనీ.. ఊరి పేరునే తన ఇంటి పేరుగా మారిన పాల్కుర్కి సోమనాథుని జీవన రేఖలను ఆయా కవులు- కవయిత్రులు తమదైన శైలితో పాటు తమకు నచ్చిన ప్రక్రియకు తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు. తెలుగు సారస్వత వైభవానికి నిలువెత్తు నిదర్శనమై నిలిచి.. తెలంగాణ తేజెని విరాజిడుగా భాసిల్లిన సోమనాథుని పట్ల గౌరవ భావంతో ఆయా కవులు, కవయిత్రులు ప్రకటించిన భావాలు ఆయా రచనల్లో చక్కగా ఒదిగిపోయాయి.



ద్రిదశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈ గ్రంథ సంపాదకులు వేముల శ్రీ వేమన శ్రీచరణ్‌దాస్ రాసిన సీసపద్యమాలికలో పాలకుర్తిలో ప్రభవించిన సోమనాథుని కీర్తిని స్తుతిస్తూ రాసిన పద్యాలు బాగున్నాయి. మంజరీ ద్విపదలో పాల్కుర్కి సోమనాథుడు 'కావ్య కవితలల్లి కవిగాను నిలిచె..కవన సేద్యమునందు కలికి తురాయి' అంటూ కొనియాడారు.

పాల్కురి సోమనాథుని సాహితీ ప్రతిభను మాడుగుల మురళీధర్ శర్మ తమ పద్యాల్లో ఆవిష్కరిస్తూ తెలంగాణ తెలుగును పలు దిశలన పంచినట్టి ప్రతిభామూర్తిగా ప్రశంసించారు.

ద్విపద రచన చేసి.. దివ్యత్వమొందిన పాలకుర్తి సోమన పరమయోగి అంటూ మడపతి సిద్ధి లింగయ్య స్వామి తమ పద్యాల ద్వారా పాల్కుర్కికి వందనం సమర్పించారు.

తెనుగింటి సోముడు అంటూ కీర్తిస్తూ కుసునూరు భద్రయ్య రాస్తే.. సోమనాథుని కవితా వైభవాన్ని చాటుతూ మాచర్ల మల్లేశం తమ పద్యాలను అల్లారు.

సోమన ద్విపదను ప్రస్తావిస్తూ ఎన్. నందిని తమ రచనను ప్రారంభిస్తే.. పరిజ్ఞాన వైశిష్ఠుడుగా సోమనాథుని అభివర్ణిస్తూ యామిని కొల్లూరి రాశారు.

తెలంగాణను కవన మాగాణిగా మలచ బీజాలు జల్లిన సోమనాథుడు ఆద్యుడు, ఆరాధ్యుడు అంటూ విన్నకోట సుబ్రహ్మణ్య హరగోపాల్ రాస్తే.. సోమనాథుడిని విప్లవ కవిగా పేర్కొంటూ బి. నారాయణ తమ కవితను రాశారు. తొలి తెలుగు కవి పుట్టిన ఊరికి పేరు తెచ్చిన ప్రముఖుడు అంటూ వల్లాల విజయలక్ష్మి రాస్తే.. పి.వి.ఆర్. జగన్నాథరావు మేటి శివకవి సోమనాథుడు అంటూ మంజరి ద్విపదలు ఆవిష్కరించారు.

శిలాదుని తపఃఫలమే.. బసవుని జన్మకారణమంటూ జాగిరి యాదగిరి పద నీరాజనం సమర్పిస్తే.. పరాంకుశం రఘునారాయణ సోమనాథుని సాహితీ సేవను కొనియాడుతూ తెలుగు భాషా సాహిత్యంలో ఓ మణిదీపంగా అభివర్ణించారు.

శివభక్తిని బోధించడానికి కవిత్వాన్ని సాధనంగా చేసుకున్న వారిలో సోమనాథుడు అగ్రగణ్యులు అంటూ వీసం లక్ష్మి రాస్తే.. బి. చెన్నారావు తమ రచనద్వారా ప్రజాకవి సోమనగా తెలియజెప్పారు. బహుభాషల ప్రవీణుడు సోమనాథ కవీంద్రుడు అంటూ శనిగరపు రాజమోహన్ రాస్తే.. త్రిభాషా కోవిదులుగా వెలుగిందిన మహనీయుడంటూ కొత్తకొండ రాజు కొనియాడారు.

సామాన్యుల భాషలోనే శివ రచనలు చేసిన మహనీయు డంటూ కంచుబారికి చిన్నారావు రాస్తే.. వైవిధ్యభరిత ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన గొప్పకవి అంటూ యల్.యన్. నీలకంఠమాచారి తమ రచనను తీర్చి దిద్దారు. తెలుగు మాగాణంలో ద్విపద కవితకు ఆద్యుడు అంటూ కౌసమళ్ళ వెంకటయ్య పేర్కొంటే.. "రగడ" ఛందోరీతిని ప్రారంభించిన ఘనాపాటి కవి పాల్కూరి అంటూ బుర్రికుమార్ రాజు తమ రచనను కొనసాగించారు.

తెలుగు పాల కడలి పాల్కుర్కి అంటూ. సి. హెచ్.వి. శేషాచారి రాస్తే.. పాల్కుర్కి సాహితీ గొప్పదనాన్ని ఆరెకటికె నాగేశ్వరరావు వివరించారు.

చందనాల వందనాలు.. పాలకుర్కి వందనాలు అంటూ తూర్పు బస్వరాజు రాస్తే.. తొలి తెలుగు కవి అంటూ మగ్గిడి రవీందర్ రాశారు. సోమనాథుడు కవి పండిత శ్రేష్ఠుడు అంటూ గాడేపల్లి మల్లికార్జునుడు పేర్కొంటే.. వేయి కాలాలు వెలగాలంటూ ఆకాంక్షిస్తూ డా॥దీపక్ న్యాతి రాశారు.

కాకతీయ మేటిగడ్డలో పుట్టిన కాకలు తీరిన సామాజిక విప్లవ కవి అంటూ మీసాల సుధాకర్ రాస్తే.. బసవపురాణ రచనలోని పాల్కురికి సోమనాథుని వాక్యాలు తెలుగునాట తెలుగు వెలుగులు పంచాయంటూ శివశ్రీ ఎన్నివెల్లి రాజమౌళి రాశారు.

శివపూజ బిల్వపత్రమంటూ ఆకుల మల్లికార్జున్ రాస్తే.. ద్వాపద ఛందస్సును ద్విగుణీకృతము చేసిన దిట్ట అంటూ నన్న పద్మ తమ రచన చేశారు. ఘనాపాటి కవి పుంగవోత్తముడు అంటూ బిజ్జనాగభూషణం తమ రచనను చేస్తే.. గద్య పద్య హృద్య రచనా దురంధరుడు అంటూ కాసుల ధీరాజశర్మ రాస్తే.. ఆయనవన్నీ జనహిత కావ్యాలేనంటూ తంగళ్ళపల్లి ఆనందాచారి కొనియాడారు.

ద్విపదను నవరసాపోషకంగా, లయ సమన్వితంగా వ్యక్తీకరించిన సమర్థుడంటూ తెలికిచెర్ల రాజకృష్ణ కామేశ్వరరావు అభిప్రాయపడితే.. అచ్చమైన తెలుగు కాదినీవు అంటూ డా॥ కాపు రమేష్ కొనియాడారు.

అగ్రవర్ణాల ఆటల నగదొక్కెను పాల్కుర్కి అంటూ మండ వీరస్వామిగౌడ్ రాస్తే.. తెలుగునాట పండించెను తెలుగు విరులు తెలుగు కైత సొబగు తేట ఈయదనము అంటూ కళ్యాణి కరణం వివరించారు.

తెలుగు సంస్కృతికి అద్దం పట్టే వైవిధ్యరచనలు చేశారంటూ వి.వి. దుర్గాప్రసాద్ ప్రశంసిస్తే.. ప్రజావాణిని బాణిని ప్రజ్వలింపజేసిన కవి వరేణ్యుడంటూ పద్మావతి రెడ్డి రాశారు. బహుభాషా కోవిదుడంటూ సింగాడి శోభామణి రాస్తే.. వేదాల సారము, అనుభవసారాల సాగరాన మునిగి సారాన్ని జగతినందుంచిన వాడంటూ బొమ్మవిమల రాశారు. పరమ పురుషుడు.. సోమనాథుడు అంటూ సంగీతం నర్సింహారావు కీరిస్తే.. సోమన్న పద్య సొబగులను వరుకోలు లక్ష్మయ్య ఆవిష్కరించయారు.

భావ విప్లవకారుడు.. వీరశైవ మత అభిలాషాకుడు అంటూ స్వరూపరాణి గజ్జల రాస్తే.. అల్పాక్షరములనల్పార్థ రచన గావించుటయే కవి వివేకమనియే అంటూ రాపోలు అరుణాస్వామి తమ పద్యాలను తీర్చిదిద్దారు. నీ కలం నుండి జాలువారిన సిరారీతులే ముగ్ధ మనోజ్ఞమ్ అంటూ కె.రంగనాయకులు పేర్కొంటే.. అచ్చ తెనుగు కవనమున కాద్యుడైన సోమనార్యుడు సంస్కృత ప్రేమ వీడక బసవ యుదాహరణము రాశాడని బండకాడి అంజయ్యగౌడ్ ప్రశంసిస్తే.. తెలుగు సాహితీ మాగానంలో అలుపెరుగక శ్రమించిన కర్షకుడు అంటూ మద్రి జయశ్రీ తమ రచనను చేశారు.

అనేక కళారూపాలను తన రచనల్లో కళ్లకు కట్టినట్టు చూపిన వాడు మన పాల్కురికి సోమన్న అంటూ తిరునగరి పద్మ రాస్తే.. ఆది కవులకు ఆదర్శమై నిలిచావంటూ డబ్బీకార్ సురేందర్ పేర్కొన్నారు.

ద్విపద, శతక, గద్యాల నర్పించి అర్చించు పాల్కురికి బసవ పురాణమనిన భువనకు శ్రవణానందకరమే అంటూ వి.వి.వి. కామేశ్వరి వ్యాఖ్యానిస్తే.. పండితారాధ్యుడు పాల్కురికి సోమన అంటూ కొడిచెల్లి రామానుజ వివరించారు.

సోమనాథుడే గొప్ప యుకర్త నిజము అంటూ డా॥రాపోలు సత్యనారాయణ పేర్కొంటే.. తేట తెలుగునందు ధీటైన పదాలతో బాట చూపినట్టి బసవభక్తి వర్యా! అంటూ లక్ష్మీకిరణ్ జబర్దస్త్ అభిప్రాయపడ్డారు.

బహుభాషల్లో అలలీలగా కవిత్వాన్ని పండించిన మహాకవి అంటూ చాపల మహేందర్ రాస్తే.. 'కవన కవలలు' అంటూ కళ్ళెం లక్ష్మణ్ తమ రచన చేశారు.

మొగ్గలు రూపంలో పాల్కురికిని ఆవిష్కరిస్తూ కదారి పెద్దయ్య రాస్తే.. తెలంగాణ కవి శ్రేష్ఠుడు' అంటూ శీలోజు శోభన్‌బాబు రాశారు.

పరమశివునిపైన పారభక్తిని పూని వ్రాసె కావ్యములను వాసిగాను అంటూ డా॥బల్లూరి ఉమాదేవి తమ పద్యాలను రాస్తే.. సోమనాథ పదాకృతాంకితం శీర్షికతో వేముల శ్రీవేమన శ్రీ చరణ్ సాయిదాస్ శ్రీ గ్రంథం చివరన రాసిన పద్యాలు బాగున్నాయి. ఇలా ఈ గ్రంథంలోని రచనలన్నీ పాల్కురికి సోమనాథుని వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని, పాండిత్యాన్ని ప్రతిభా పాటవాలను ఉటంకిస్తూ రూపుదిద్దుకున్నాయి. చాలా కవితల్లో కవిత్వాంశ కొరవడినప్పటికీ.. కొన్ని రచనలు మినీ వ్యాసాలుగా రూపు దిద్దుకున్నప్పటికీ.. పాల్కురికి పై ఆయా కవులు- కవయిత్రులు చూపిన శ్రద్ధాభక్తులను అభినందించకుండా ఉండలేము..

ప్రతులకు: వేముల శ్రీ వేమన
శ్రీ చరణ్ సాయిదాస్
నంగునూర్ (గ్రా)
జిల్లా సిద్దిపేట-50 22 80
సెల్: 9652256429



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## పాపం.. నాగరాజు

అరే ఏందిరా భయ్..గిట్ల జేస్తివి
నువ్వయినా.. నేనయినా
నీ చెల్లెలయినా
ఒక అమ్మిజాన్ కు పుట్టినోళ్లమే కదా
ఎవరిని నరికినా వచ్చేది ఎర్రటి రక్తమే కదా
పుట్టినప్పుడు పోయేటప్పుడు
మనం ఒట్టి చేతులమే
మధ్యలో వచ్చిన ఈ కులమతాల రోగం
నీకెట్టా అంటుకుందిరా అబ్బాయ్
ఖురానయినా బైబిలైనా భగవద్గీతయినా
సాటి మనిషిని ప్రేమించమనేకదా చెప్పయి
నీ చెల్లిప్రేమను చూడంగనే
కండ్లు ఎరుపెక్కి
పాపం.. నాగరాజు రక్తం కండ్లజూస్తివి
పక్కపక్కనే వుండేటోళ్లం
పక్కలో బల్లెమై పొడుస్తావనుకోలేదు
ఒక నిండు ప్రాణాన్ని పొట్టనబెట్టుకొని
ఏం మూటగట్టుకున్నావోయ్
నిన్ను ఆ యేసు క్షమించినా
అల్లా మటుకు క్షమించదురా భయ్
( సరూర్ నగర్ లో పరువుహత్యకు బలైన నాగరాజు కు..బాధతో...)

**-సునీత గంగవరపు**
9494084576

## మట్టి బంధం

ఎన్ని వర్ణాల రూపం
ఎత్తు పల్లాల దేహం
పచ్చనాకుల హరితం
చుట్టు నది సముద్రాల తీరం!

మట్టి అంటే పేగు బంధం
ఎన్ని జీవులకు జన్మనిచ్చిందో
పుట్టిన ప్రాణిని తన తనువుపై మోస్తూ
గిట్టిన జీవుల కడుపులో దాచుకుంటుంది!

తన కడుపు చీల్చుకుని బువ్వ పెట్టింది
మన ఆట పాటలకు తాను మురిసిపోయింది
మనం ప్రేమగా వుంటే పొంగిపోయింది
యుద్ధాలు చేసుకుంటే తల్లడిల్లింది!

ఇప్పుడు...
ఆ మట్టి పేగు రోగగ్రస్తురాలైంది
తన రోధన వినేవాడు కరువైనాడే
యని మధన పడుతు రోధిస్తుంది!

మనిషి!
పరిశ్రమలు వ్యవసాయం లోనా
విషపూరిత రసాయనాలెన్నో వాడి
అణువణువు కలుషితంచేస్తు
మట్టి రూపురేఖలను మారుస్తున్నాడు
తన భవిశ్యత్తును తానే చిద్రం చేసుకుంటు
నా ఉనికిని ప్రశ్నార్ధకం చేస్తుండని
వేదన చెందుతుంది!

ఆ మట్టితల్లి పొత్తిళ్ళలో పుట్టి పెరిగినోళ్ళం
స్వార్థపూరితమైన మన
ఆలోచనలకు స్వస్తిచెప్పి
మట్టిని మన భూమితల్లిని
కాపాడుదాము రండి!!



**- వజ్జీరు ప్రదీప్**
9989562991

## పల్లెనవ్వింది

ఆకలి కేకలు తట్టుకోలేక వలసపోయిన జనం
నేలమీదే కాదు గుండెలలో కూడ బీటలు
పచ్చని చీరకట్టిన అవని ఎండిన మోడయింది

చావు అంచున వేలాడుతున్న నేలబిడ్డడు
నిస్సత్తువను భుజానికి ఎత్తుకోలేదు
ఎండిన కంటిచెమ్మను ఎదురు పెట్టుబడి పెట్టాడు.

మొండితనాన్ని నాగేటికి అద్ది చేనును చీల్చాడు
కన్నతల్లి బిడ్డకు ద్రోహం చేయదనే నమ్మకం
పంటకు కంచెగా మారి రక్షణకోటయింది

మూగజీవులే తోడనుకుని సేంద్రియం వైపు మొగ్గాడు
పశువిసర్జకాలే పోషకపదార్థాలుగా మారాయి
పంచగవ్యాలే క్రిమిసంహారకాలుగా కొలువుతీరాయి.

పంటమార్పిడి సెద్యానికి ఊపిరిపోసింది
రైతు నమ్మకం పంటకంకులతో పుట్టినింపింది
స్వేచ్ఛావిపణి సరికొత్త ఊపునిచ్చింది.

కాంక్రీటు పలకలకింద చితికిన బ్రతుకులకు తెలివి వచ్చి
వలసపోయిన కాకులు తిరిగివచ్చి ఇంటికొమ్మను చేరాయి
పచ్చని తరువులు తలెత్తి నిత్యవసంతాన్ని కూర్చాయి

నేలమ్మ తల్లి పచ్చని వోణి పల్లెను చుట్టింది
మామిడి తోరణాలతో, రంగవల్లులతో
సరికొత్త ఉగాది మా పల్లెకు వచ్చింది

తిరిగివచ్చిన బిడ్డల ఒడి చేర్చుకుని
పల్లెగూటికి తిరిగి పండుగ వచ్చిందని
మా పల్లె తృప్తిగా నవ్వింది.



**-శింగరాజు శ్రీనివాసరావు**
9052048706

## జ్ఞాపకాల నీడలో మావూరు

మా ఊరిలో
అంతటా తుమ్మ చెట్లే
పసుపు పచ్చని పూలతో మెరిసిపోతూ
ఆశ్చర్యంగా చూసేవారికి
కనువిందు చేస్తాయి
పసిడి రంగులో పండిన తుమ్మ కాయలు
మేకలకు ఎద్దులకు పశువులకు
ఎంతో ఇష్టమైన ప్రీతికరమైన ఆహారమవే
యిప్పుడవి కనుమరుగై పోయే...
చేపల రొయ్యల చెరువులుగా మారి
ఎక్కడ చూసినా భూమంతా జలమయమై

ఇంటింటికి రెంద్రెండు ఎడ్లబండ్లుండేవి
బండెనుక బండి వరుసగా
పది మైళ్ల దూరంలో
జతకట్టు గొలుసులా
ముచ్చటగా కనువిందుగా
తరతరాలుగా వాళ్ళు వీళ్ళు
చెప్పుకునే గాథలే
యీ ఎడ్లబండ్లు
పశుసంపద వ్యవసాయ పనులే
యివీ కనిపించకపోవడానికి
ఉప్పు నీటి జలమయమే.

వ్యవసాయానికి సంబంధించిన ప్రతి మొక్క
మా ఊళ్లో ప్రత్యక్షమై నాట్యం చేసేవి
పచ్చని పైరు గాలులే మానవ సమూహానికి
రోగాలు లేని దీర్ఘాయుష్షువులే వో వరం
యేడాదికి మూడు పంటలు పండుతాయంటే
పక్క వూళ్ళో వాళ్లు వచ్చి
మరీ చూసి పోయేవాళ్ళు
శక్తివంతమైన సారవంతమైన
భూమి మా వూరు.

మనిషి అత్యాశకి
ఎలాంటి భూమైనా పతన మవ్వాల్సిందే
బంగారం పండే భూమిని
దురాశతో నాశనం చేసి
చితికి పోయినా బతుకులతో
దుర్భరమైన జీవితాలతో
వలస పట్టిన కుటుంబాలెన్నో
మళ్లీ మా వూళ్లో
స్వర్ణ పుష్పాలు వికసించాలనీ
పశు సంపదలు పెరగాలనీ
పచ్చని పైరు పంటలు పండాలనీ
పుష్కలంగా ప్రవహించే నదుల్లో
స్వచ్ఛమైన నీరు తాగాలనీ
పదే పదే జ్ఞాపకాల నీడలు
ప్రతి రోజు నన్ను వేధిస్తుంటే
వూళ్ళో వున్న ప్రతి వొక్కరినీ
నీడలా వెంటాడి వేధించాలనీ
అందరిలో అత్యాశ పోవాలనీ
పూర్వ వైభవం
మళ్లీ రావాలనీ ఆశతో



**-దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు**
సెల్ : 9493033534

## ఏనుగు! ఏనుగు

ఏనుగు ! ఏనుగు !
స్థంభాల్లాంటి కాళ్లతో
చేటలంటి చెవులతో
బుజ్జి బుజ్జి కన్నులతో
నాకెంతో నచ్చిన ఏనుగు
మా ఊరొచ్చిన ఏనుగు
మా ఊరి గుడిలో ఏనుగు
మేమెంతో మెచ్చిన ఏనుగు
మమ్మల్ని ఆశీర్వదించే ఏనుగు



**-యలమర్తి అనూరాధ**
చరవాణి:9247260206

పుస్తక సమీక్ష

# రెండు నాటికలు.. ఆదర్శాలు.. పర్యవసానాలు



'కావ్యేషు నాటకం రమ్యం' అని నాటక ప్రక్రియను సంస్కృత పండితులు సంభావించారు. ఆదిలో తెలుగు నాటక రచయితలు సంస్కృత కవులనే అనుసరించినా, క్రమక్రమంగా తెలుగు జన జీవనాన్ని ప్రతిబింబింప చేయటం ప్రారంభించారు. వీరేశలింగం, గురజాడ చిలకమర్తి ప్రభుతులు సాంఘిక ఇతివృత్తాలు, సామాజిక సమస్యలు వాటికి సమాధానాలు నాటకాలలో జొప్పించేవారు. ప్రేక్షకులు తమను ఈ నాటకాల్లో చూసుకునే వారు. పాత్రలకు అనుకూలంగా స్పందిస్తూ, నాటకాల్లో అంతర్లీనంగా కనబడే సందేశాల్ని ఆదర్శంగా తీసుకునేవారు.

ఇరవయి శతాబ్ద ప్రారంభం నాటికి నాటక రంగం పెను మార్పులకు లోనయింది. పుర ప్రముఖుల ఆదరణతో నాటక సంస్థలు ఆవిర్భవించాయి. అచిర కాలంలోనే నాటకం ప్రజల్లో ఒక భాగమయింది. కంటికి, చెవులకు ఏకకాలంలో ఆనందం కలిగించే ప్రక్రియ కావటం వల్ల పండితులు పామరులు సమంగా ఆదరించారు.

సినిమాలు, ఆ తర్వాత టీవీల రాకవల్ల నాటక రంగం పెను మార్పులకు లోనయింది. ఆదరించే నాథుడు కరువవటం వల్ల దాదాపు క్షీణ దశకు చేరిందనుకునే చెప్పుకోవాల్సిన రోజులివి. సురభి సంస్థ, గుంటూరు, ఉభయ గోదావరులలో మరికొన్ని సంస్థలు నేడు నాటక రంగాన్ని ఇంకా నిలబెడుతున్నాయని చెప్పుకోవచ్చును.

రెండు రంగులు రెండు తెరలు' నాటికల రచయిత



చిత్రాడ కిషోర్‌కుమార్ సుమారు మూడు దశాబ్దాలుగా నాటక రంగ రచయితగా ప్రదర్శకుడిగా ప్రజల మెప్పుపొందుతున్నారు. లోగడ వీరు త్యాగం, బతుకు చిత్రాలు అను రెండు నాటికలు రచించారు. ప్రదర్శించారు. తన నాటకాల ద్వారా ప్రజలకు గొప్ప సందేశాలివ్వాలని తపించే సంస్కార హృదయం గలవారు. ప్రస్తుత సంపుటిలో త్యాగం మరియు బతుకు చిత్రాలు అను రెండు నాటికలున్నాయి. త్యాగం నాటికలో 12 పాత్రలున్నాయి. స్త్రీ పాత్రలు లేని నాటిక, కిరణ్ అనే ప్రతిభ కలిగిన విద్యార్థి ఆదర్శవాది. శృతి అనే అమ్మాయి సహధ్యాయి. కిరణ్‌తో సన్నిహితంగా ఉంటుంది. వరప్రసాదరావు మాష్టారుకు ఇద్దరు జులాయి కొడుకులు. ఒక కూతురు ప్రత్యూష. ఆమె పెళ్ళికి కాబోయే వరళ్ళు అడిగే కట్నం ఇవ్వలేని స్థితి ఆయనది. శృతి ప్రేమను త్యాగం చేసి ప్రత్యూషను పెళ్ళాడతానని చెప్పటంతో, 4 రంగాల నాటికకు తెర పడుతుంది.

రెండవ నాటిక 'బతుకు చిత్రాలు'లో రంగయ్య ఓ పనివాడు. వెంకటేశం, గిరీషం రంగయ్య కుమారులు. చదువుకుంటుంటాడు. వెంకటేశం జులాయి, చదువు పేరుతో తండ్రిని డబ్బులడిగి దుర్వసనాలకు ఖర్చుపెడుతూంటాడు. నరసింహం సంపన్నుడు. రంగయ్య యజమాని. రాజేష్ నరసింహం కుమారుడు. రాజేష్, వెంకటేశం కలిసి తాగుతూంటారు. విలన్ మస్తాన్ రాజేష్, నరసింహం, చివరి అంకంలో పరస్పరం పొడుచుకుని అసువులు బాస్తారు. 8 అంకాలున్న ఈ నాటికలో అనవసర సాగదీతలున్నట్లవుపిస్తాయి. చదువరికి, ప్రదర్శించిన సందర్భంలో ప్రేక్షకుడికి కాలక్షేపం కలిగించే నాటికలు ఇవి.

ప్రతులకు: చిత్రాడ కిషోర్‌కుమార్
ఎఫ్ఎఫ్-8, 5వ అంతస్తు, బ్లాక్-3
మహేశ్వరి టవర్స్, పవర్‌గ్రిడ్ ఎదురుగా
క్రిష్ణా జిల్లా, ఆంధ్ర.
సెల్: 9866912906



**- కూర చిదంబరం**
సెల్: 8639338675

పుస్తక సమీక్ష

# డా॥ దాసరి శ్రీనాథ్‌గౌడ్- పద్య కావ్యాలు

గేయ, పద్య, వచన, వ్యాస, కవితా ప్రక్రియలలో సుపరిచితులైన కవి, రచయిత, జానపద గాయకుడు, కళాకారుడు డా॥ దాసరి శ్రీనాథ్‌గౌడ్, 'శ్రీ స్వారోచిష మనుసంభవము' ఆటవెలది పద్య కావ్యాన్ని వెలువరించారు. మను చరిత్ర ఆధారంగా కథను, పద్యాలలో కూర్చి అలతి అలతి పదాలతో చదువరులు అందించారు. ప్రవరుని సౌశీల్య వ్యక్తిత్వం, సద్గుణ సంపద యువతకు ఆదర్శ ప్రాయం కావాలని కవి ఆకాంక్షించారు. ఇష్టదేవతా ప్రార్థనలకు సంబంధించిన తొలి 19 పద్యాలు, కవి తన గజేంద్ర మోక్షం శతకం, శ్రీ స్వారోచిషమను సంభవం రెండు పద్య కావ్యాలలో ఒకే విధంగా పొందుపరిచి కథను కొనసాగించారు. సరళంగా, సుబోధకంగా రసరమ్యంగా భావుకతతో రాయటమేగాక, సందర్భానుసారంగా అర్థవంతంగా సంభీర పద సంపదను కూడా కవి ప్రయోగించారు. సరైన తెలుగు పదాలను ఎన్నుకొనడంలో కవి శ్రీనాథ్‌గౌడ్ రచనా శైలి ప్రజ్ఞ వ్యక్తమవుతోంది.

''మరులు గొంటినోలు మదన మోహన రూప



తాపమింక నేను తాళలేక
కోరి వలచినాను కోర్కె దీర్చుమిపుడు
జాగు జేయనేల సమ్మతించు''

వరూధిని ప్రవర్తనలోని స్వాభావిక వాంఛాభి వ్యక్తీకరణ పద ప్రయోగాల సొగసు కవి చక్కగా వ్యక్తం చేసారు. ప్రస్తుత తరం యువతకు పూర్వ కావ్యాలు, ప్రబంధ సాహిత్యాన్ని చదివే అవకాశం, ఓపికా లేదు. ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని పెద్దన ఈ ప్రాచీన కావ్యంలో వరూధినీ ప్రవరాఖ్యుల కథను ఎంపిక చేసుకొని 117 పద్యాలలో అత్యంత సౌందర్యాత్మకంగా రాయటం డా॥దాసరి శ్రీనాథ్‌గౌడ్

**"శ్రీ మనువు చరిత్ర శ్రీలు గుఱరయ**
**ఆటవెలదులందు నలరించి కూర్చెను**
**చదువుకొనగ సులభ సాధనముగ"**

ధరణి జనులకెల్ల దాసరి శ్రీనాథు, అభినంద నీయులు.

**ప్రతులకు:**డా॥దాసరి శ్రీనాథ్‌గౌడ్
ఇ.నెం.1ఎ-120/20, శ్రీనివాస గార్డెన్ ఎదురు రోడ్, ఆర్.ఆర్. నగర్
గ్రా॥ తిమ్మాపూర్-504 209.
మం॥ మందమఱ్ఱి,
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ
సెల్: 9701781696
7780143871



**-జయసూర్య**
సెల్: 90149 48336/
9440664610

